సాక్షి
కుమురం భీం
సోమవారం । 27 । జనవరి । 2025



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక నృత్యం



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## న్యూస్‌రీల్

### రచనలతో సమాజాన్ని చైతన్యపర్చాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**ఆసిఫాబాద్:** కవులు తమ రచనలతో సమాజాన్ని చైతన్యపర్చాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యపరిచే కవులు, రచయితలకు జిల్లాలో కొదవలేదన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలతోపాటు చదువుల్లో ముందుండాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, రచయితల కవిత్వాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, కవులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, డీఈవో కార్యాలయ అధికారి ఉదయబాబు, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

**దహెగాం(సిర్పూర్):** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండలంలోని ఇట్యాల, కోత్మీర్, లగ్గాం గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల దశ మారుతుందన్నారు. ఏళ్లుగా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, నాయకులు గజ్జెల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు బాధ్యతలు

**మంచిర్యాలటౌన్:** మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిషోర్ ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ఆ జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్)దీపక్ తివారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మంచిర్యాల జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, క్యాతనపల్లి, లక్సెట్టిపేట్ మున్సిపాలిటీలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు లేక పాలకవర్గం లేకపోవడంతో ఆ మున్సిపాలిటీకి ఇప్పటికే ప్రత్యేక అధికారి ఉన్నారు. ఇక ఇటీవల మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. నస్పూర్ మున్సిపాలిటీని ఇందులో విలీనం చేశారు. అయితే మంచిర్యాలను కార్పొరేషన్‌గా మారుస్తూ జీవో విడుదల కాలేదు. అయినా నస్పూర్‌కు ప్రత్యేక అధికారిని నియమించలేదు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కలెక్టరేట్‌లో జాతీయ గీతం ఆలపిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**ఆసిఫాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకలకు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు కలెక్టర్, ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి ఆరు బెటాలియన్లకు చెందిన పోలీసులు కవాతు నిర్వహించారు. ఇందులో రెండు మహిళా బెటాలియన్లు ఉండటం విశేషం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ జిల్లా ప్రగతి చదివి వినిపించారు. రాజ్యాంగం అమల్లోకి రావడంతో సార్వభౌమ లౌకిక ప్రజాస్వామ్య దేశంగా అవతరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు వంటి నాలుగు పథకాలను అందించాలని నిర్ణయించిందని, అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు.

**రైతు సంక్షేమం**

రైతుల కోసం తొలి ఏడాది రైతు రుణమాఫీ, రైతు నేస్తం, వరి ధాన్యానికి బోనస్, ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రోత్సాహకాలు అమలు చేసిందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు అందించేందుకు ప్రతీ గ్రామంలో గ్రామసభ నిర్వహించామని తెలిపారు. జిల్లాలో 51,523 మంది రైతులకు రూ.465.84 కోట్ల రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. 1,441 మంది రైతుల నుంచి 9,850 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి, ఇప్పటివరకు రూ.40,96,400 బోనస్ చెల్లించామని తెలిపారు. ఉపాధిహామీలో కనీసం 20 రోజులు పనిచేసి, భూమిలేని రైతు కూలీ కుటుంబాల జీవన స్థితిగతులు మెరుగుపర్చేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం అమలు చేయనున్నామని వివరించారు. నిరుపేదలను ఎంపిక చేసి సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలతో పక్కా ఇల్లు నిర్మించుకునేలా ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున జిల్లాకు ఏడు వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రేషన్ కార్డు అవసరమైన కుటుంబాలను గుర్తించి, వారికి కార్డులు మంజూరు చేయనున్నామని తెలిపారు. అభయ హస్తం గ్యారంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. గృహజ్యోతి పథకం కింద 69,636 కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నామని పేర్కొన్నారు.

**ఇందిర మహిళాశక్తి**

ఇందిర మహిళా శక్తి పథకం కింద జిల్లాలో 3 ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించినట్లు తెలిపారు. రైతుబీమా పథకం కింద గతేడాది 215 మంది రైతుల కుటుంబాలకు రూ.10.75 కోట్లు అందించామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లాలో రూ.9.33 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు డైట్‌చార్జీలు 40 శాతం, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచి కామన్ డైట్ మెనూ ప్రారంభించామన్నారు. భూభారతి రెవెన్యూ చట్టం అమల్లోకి రావడం, ధరణి పోర్టల్‌లో అన్ని మాడ్యూల్స్‌ల్లో పెండింగ్‌లో ఉన్న 19,463 దరఖాస్తులు పరిష్కరించామని వివరించారు. మహిళా ఆరోగ్య కార్యక్రమం కింద జిల్లాలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 4,112 మంది మహిళలను గుర్తించి చికిత్స అందించామన్నారు. రూ.5 కోట్లతో నూతన నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు భవనంలో తరగతులు కొనసాగుతున్నాయన్నారు. షెడ్యూల్ కులాలకు సంబంధించి 10 సంక్షేమ వసతి గృహాల్లో 481 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద జిల్లాలో ఉన్న 78 సీట్లను భర్తీ చేశామని అన్నారు.

**గిరిజన అభివృద్ధి శాఖ**

గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 50 ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో 10,315 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 2024- 25 సంవత్సరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 472 మంది విద్యార్థులకు రూ.6,27,500 నిధులు విడుదల చేశామన్నారు. మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో అనుబంధ పోషకాహార పథకం కింద 46,188 మంది పిల్లలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా 973 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 8,568 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. 200 మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలోని 314 చౌకధరల దుకాణాల ద్వారా 1,39,782 కుటుంబాలకు ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతుందన్నారు. 1,165 ప్రభుత్వ పాఠశాలలు, 973 అంగన్‌వాడీ కేంద్రాలు, 112 ప్రభుత్వ వసతి గృహాలకు సన్నబియ్యం ప్రతినెలా సరఫరా చేస్తున్నామని వివరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది వనమహోత్సవం కింద 53 లక్షల మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టామన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఫారెస్ట్ ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశామన్నారు. కల్యాణలక్ష్మి పథకం కింద 1,918 ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం రూ.21.27 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా కెరమెరి మండలం జోడేఘాట్‌లో రూ.5 కోట్లతో పర్యాటక రంగ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక నృత్యం



ఆర్టీసీ బస్సు శకటం



పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు

# పల్లెల్లో పథకాల పండుగ



జైత్‌పూర్‌లో లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మార్లవాయిలో లబ్ధిదారులతో అదనపు కలెక్టర్

**వాంకిడి/జైనూర్/కెరమెరి/సిర్పూర్(టి):** రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పథకాల అమలు కోసం అధికారులు మండలానికో గ్రమాన్ని ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. వాంకిడి మండలం జైత్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. జైనూర్ మండలం మార్లవాయి, కెరమెరి మండలం కొఠారి గ్రామాల్లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు పనిచేసి జాబితా రూపొందించిందన్నారు. సిర్పూర్(టి) మండలం మేడిపల్లి గ్రామ పంచాయతీలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సంక్షేమ పథకాలను ప్రారంభించారు. విడతలవారీగా అన్నిగ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. మేడిపల్లి పంచాయతీ పరిధిలో రైతు భరోసా పథకం కింద 195 మంది, రైతు ఆత్మీయ భరోసా 13 మంది, ఇందిరమ్మ ఇళ్లు 154 మంది, కొత్త రేషన్ కార్డులు 42 మందిని ఎంపిక చేశామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్పీ చిత్తరంజన్, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో అంజద్‌పాషా, నాయకులు కుసుంబ్‌రావు, మునీర్ అహ్మద్, ఆత్రం లక్ష్మణ్, లింబారావు, న్యానేశ్వర్, జాలింషా, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నెలవు

- అస్తవ్యస్తంగా జాతీయ రహదారి నిర్మాణం
- ఆసిఫాబాద్ నుంచి హైవే పైకి ప్రమాదకర ప్రయాణం
- గుండి దారి అధ్వానంగా ఉండటంతో రాంగ్‌రూట్‌లోనే..



జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులు



అధ్వానంగా గుండి రహదారి

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లాలో నిర్మించిన జాతీయ రహదారి- 363 ప్రమాదాలకు నెలవుగా మారింది. ముఖ్యంగా జిల్లా కేంద్రం నుంచి హైవే పైకి వెళ్లే వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టణం నుంచి వెళ్లే గుండి దారి అధ్వానంగా ఉండటంతో చాలా మంది రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు సాగిస్తున్నారు. గతేడాది ఇద్దరు మృత్యువాత పడగా, అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. తాజాగా శనివారం రాంగ్‌రూట్‌లో వస్తున్న ఓ బైక్‌ను కారు ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.

**డివైడర్లు పెట్టినా..**

2016లో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి మహారాష్ట్ర సరిహద్దులోని వాంకిడి మండలం గోయగాం వరకు రాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారి- 363గా అప్‌గ్రేడ్ చేశారు. జిల్లాలో రెబ్బెన మండలం రేపల్లేవాడ నుంచి గోయగాం వరకు 54 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే జిల్లా కేంద్రంలో ఇష్టారీతిన పనులు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి(మంచిర్యాల వైపు) జిల్లా కేంద్రంలోకి వచ్చే రూట్లో పోలీసుల సూచనతో హైవే అధికారులు రోడ్డును విభజిస్తూ సిమెంటు గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఆదర్శ పాఠశాల ఎదురుగా రోడ్డు దాటుతుండటంతో అక్కడ కూడా యూటర్న్ మూసివేశారు. అయినా చాలా మంది రాంగ్‌రూట్‌లోనే వెళ్తున్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక అటవీశాఖ చెక్‌పోస్టు వాహనదారులకు ఎంవీఐ మోహన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించిన గంటల వ్యవధిలోనే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాత చెక్‌పోస్టు వద్ద నుంచి డివైడర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**అధ్వానంగా గుండి దారి**

పట్టణంలోకి ప్రవేశించడం, జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల వైపు వెళ్లేవారు హైవే పైకి వెళ్లడానికి జిల్లా కేంద్రం చివర రోడ్డును విభజిస్తూ డివైడర్లు ఏర్పాటు చేశారు. మంచిర్యాల వైపు వెళ్లే వారు ఎడమ వైపునకు గుండి గ్రామానికి వెళ్లే అండర్‌పాస్ వద్ద యూటర్న్ తీసుకుని నేషనల్ హైవే పైకి రావాల్సి ఉంటుంది. ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. హైవే పూర్తయిన తర్వాత గత జనవరి వరకు జిల్లా కేంద్రం చివర హైవే రహదారి కలిసే విధంగా ఏర్పాట్లు చేశారు. జనవరి 21న ఓ కంటైనర్ ఢీకొని తల్లీకుమారుడు మృతి చెందారు. ప్రమాదాలు జరుగుతుండడంతో అక్కడ మూసివేసి వాహనాలు జిల్లా కేంద్రం నుంచి గుండి దారి మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన రహదారి నుంచి గుండి గ్రామ అండర్‌పాస్ వరకు రహదారి అధ్వానంగా ఉంది. వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇష్టపడడం లేదు. నేరుగా వెళ్తూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నారు. గుండి రహదారి పూర్తయితే రాంగ్‌రూట్‌లో వెళ్లేవారి సంఖ్య పూర్తిగా తగ్గుతుంది. అధికారుల గుండి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

**అవగాహన కల్పిస్తాం**

జిల్లా కేంద్రం నుంచి హైవే పైకి వెళ్లే వాహనదారులు తప్పనిసరిగా గుండి అండర్‌పాస్ కింది నుంచి వెళ్లాలి. రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలను గుర్తించడానికి ప్రస్తుతం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక చెక్‌పాయింట్ ఏర్పాటు చేస్తాం. రాంగ్‌రూట్‌లో వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపడతాం. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

– బుద్దె రవీందర్, పట్టణ సీఐ

# సింగరేణిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలి

- జీఎం శ్రీనివాస్



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమాదేవి

**రెబ్బెన(ఆసిఫాబాద్):** ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తూ సింగరేణి సంస్థను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటిటౌన్ షిప్‌లోని భీమన్న స్టేడియంలో ఆదివారం గణతంత్ర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్థానిక జీఎం కార్యాలయంతోపాటు సీఈఆర్ క్లబ్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం భీమన్న స్టేడియంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. జీఎం శ్రీనివాస్ సీఐఎస్ఎఫ్, ఎస్ అండ్‌పీసీ, పాఠశాలల విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏరియాలో ఉత్తమ ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించి బహుమతులు అందించారు. జీఎం మాట్లాడుతూ ఏరియాకు త్వరలోనే పూర్వవైభవం రానుందన్నారు. గోలేటి, మాదారం ఓసీపీల ఏర్పాటుతో ఉత్పత్తి పరుగులు తీస్తుందన్నారు. ప్రస్తుతం ఒకే ఓసీపీ ద్వారా మాత్రమే బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతున్నా.. భవిష్యత్తులో కొత్త గనులు రానున్నాయని తెలిపారు. ఈ ఏడాది గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తి చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు ఉమారాణి, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్వోటూజీఎం రాజమల్లు, సీఎంవోఏఐ అధ్యక్షుడు నరేందర్, ఏరియా ఇంజినీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉత్తమ శకటంగా 'ఆర్టీసీ'



డీఎం విశ్వనాథ్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

ఆసిఫాబాద్: గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన శకటాల ప్రదర్శనలో ఆర్టీసీ బస్సు ఉత్తమ శకటంగా ఎంపికైంది. ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఆర్టీసీ అందిస్తున్న సేవలను తెలిపే విధంగా శకటాన్ని రూపొందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి బస్సులో పరేడ్ గ్రౌండ్ చుట్టూ ప్రయాణించారు. అనంతరం డీఎం విశ్వనాథ్‌కు ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బెజ్జూర్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తితో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుంటలమానెపల్లికి బోర్‌కుట్టే ఎమ్మాజీ (48) వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య రుక్మాబాయి, నలుగురు సంతానం. భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ బస్టాండ్ సమీపంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి బయట ఆడుకుంటున్న జాడి అంకులు (4)పై పిచ్చికుక్క దాడి చేయగా అతని ముఖంపై గాయాలయ్యాయి. అతడి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని పిచ్చికుక్కను తరిమారు. కుటుంబ సభ్యులు బాలుడిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ అటవీ సెక్షన్, లోతొర్రె బీట్‌లో అక్రమంగా శనివారం అర్ధరాత్రి సమయంలో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. పెట్రోలింగ్ సమయంలో ట్రాక్టర్ కనిపించడంతో సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని మహిపాల్‌రెడ్డిగా తెలిసిందని ఆయన అన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



# ఉత్తమ సేవలకు గుర్తింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లాలో మొత్తం 45 విభాగాల్లోని 153 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పొందారు.



శ్రద్ధా శుక్లా, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ | ప్రభాకర్, అదనపు ఎస్పీ | కరుణాకర్, డీఎస్పీ, ఆసిఫాబాద్ | రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్ | రమేశ్, సీఐ జైనూర్ | రాణాప్రతాప్, సీఐ



స్వామి, సీఐ, రెబ్బెన | గంగన్న, ఎస్సై, లింగాపూర్ | జగన్మోహన్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ | వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ | జితేందర్, నాయబ్ తహసీల్దార్ | వెంకటేశ్, ఎస్సై, టాస్క్‌ఫోర్స్



సతీశ్‌రెడ్డి, ఫైర్‌మెన్ | మహేశ్, లీడింగ్ ఫైర్‌మెన్ | మహాలక్ష్మి, సామాజిక ఆరోగ్య అధికారి | భిక్షపతిగౌడ్, డీపీవో | రజిత, జూనియర్ అసిస్టెంట్ | సునీత, షీటీం పీసీ



ఠాకూర్ వనిత, అంగన్‌వాడీ టీచర్ | పాషాఖాన్, ఫొటోగ్రాఫర్, డీపీఆర్‌వో | రాందాస్, ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్ | సాయన్న, డీఏవో, ఆర్డీవో కార్యాలయం | శ్రీకాంత్, కంప్యూటర్ ఆపరేటర్ | సులోచన, ఆశవర్కర్ | శంకర్, ఎంవీఐ | మోహన్‌రావు, అటవీశాఖ | వెంకటకృష్ణ, అటవీశాఖ | మానస, ఏఈవో

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



జెండాకు వందనం చేస్తున్న మందమర్రి ఏరియా జీఎం



శ్రీరాంపూర్: జాతీయ జెండాకు వందనం చేస్తున్న జీఎం సూర్యనారాయణ

- గనులపై గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండావిష్కరించిన జీఎంలు
- ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి గనులు, కార్మికవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. సింగరేణి ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో, తన కార్యాలయం వద్ద శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జీఎం దేవేందర్ దంపతులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సింగరేణి ప్రగతి సాధిస్తుందని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో 18 మంది, మందమర్రి ఏరియాలో 12 మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని వద్ద పీవో టి.శ్రీనివాస్, శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని ఆటో యూనియన్ కార్యాలయం వద్ద నాయకుడు ముఖేష్‌గౌడ్, హెచ్ఎంఎస్ యూనియన్ కార్యాలయం వద్ద కేంద్ర కార్యదర్శి గొల్ల సత్యనారాయణలు జాతీయ జెండాలు ఎగురవేశారు. కంపెనీ విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్ పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీలో..



జాతీయ జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగిలు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ గోవర్ధన్ జాతీయ జెండావిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు ఆకట్టుకుంది. వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, సెక్యూరిటీ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రభాకర్, శ్యాంబాబు, రవికిరణ్, రఘువీర్, స్వప్న, విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లో బెటాలియన్‌కు ప్రథమ స్థానం



బహుమతి అందుకుంటున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో పరేడ్‌లో గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ నుంచి పాల్గొన్న కాంటింజెంట్ ప్రథమ బహుమతి సాధించింది. అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్ఐ ఎం.శ్రీనివాస్, ఆర్ఎస్సైలు రవి, రాజశేఖర్, సిబ్బంది మొత్తం 40 మంది ఉన్నారు. రాష్ట్రం నుంచి పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గవర్నర్ రామెన్ దేఖా, డీజీపీ అశోక్‌జునేజా బహుమతి అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, ఆర్ఐలు సిబ్బంది వారిని అభినందించారు.

- గుడిపేట బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో కమాండెంట్ వెంకటరాములు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మెడికల్ అధికారులు సంతోశ్‌సింగ్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఉత్కృష్ట పతకాలను కమాండెంట్ అందజేశారు.



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు



శ్రీరాంపూర్: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



మందమర్రిరూరల్: విద్యార్థుల ప్రదర్శన



శ్రీరాంపూర్: హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద..

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి ఐటీడీఏ పీవో జాతీయజెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు బాగా చదివి ఐపీఎస్, ఐఏఎస్‌లుగా రాణించాలన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గిరిజనాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను పీవో వివరించారు. 11 మండలాల్లో 11 పీహెచ్‌సీల్లో అవ్వల్ అంబులెన్స్ ద్వారా 2023–24లో 2644 మంది గర్భిణులకు ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఈఈ తానాజీ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఖుష్బూ గుప్తా

# సిరి'కుండ'లోనే నాగోబా నైవేద్యం



జాతర కోసం తయారుచేసిన కుండలు

ఇచ్చోడ: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగో బాకు అభిషేకం చేయాలన్నా .. నైవేద్యం సిద్ధం చేయాలన్నా సిరికొండ కుండలనే వాడుతారు. శతాబ్దాలుగా సిరికొండలోని గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలోనే నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. నాగోబా అప్పట్లో మె స్రం వంశీయులకు కలలో వచ్చి సిరికొండలో నివసిస్తున్న గుగ్గిల వంశీయులు త యారు చేసిన కుండలనే పూజలకు ఉపయోగించాలని చెప్పినట్లు ప్రతీతి. పూజ ప్రారంభం నుంచి అఖరి రోజు నైవేద్యం సమర్పించే వరకు ఇక్కడి కుండలనే వాడుతారు.

**ప్రచారయాత్రలోనే కుండల తయారీకి ఆర్డర్**

కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి ప్రారంభమైన కటోడ మెస్రం కోసేరావు, పర్ధాన్ దాదారావులతో కూడిన ప్రచారం రథం(ఎడ్లబండి) మొదటిరోజే సిరికొండ మండల కేంద్రంలో ఉన్న గుగ్గిల స్వామి ఇంటికి చేరుకొని జాతరకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డర్ ఇస్తారు. మరుసటి రోజు నుంచే కుండల తయారీ ప్రారంభిస్తారు. తయారైన కుండలకు మహాజాతర ప్రారంభానికి రెండు రోజుల ముందు మెస్రం వంశీయులు పూజలు నిర్వహించి ఎడ్లబండిపై కేస్లాపూర్‌కు తీసుకెళ్తారు.

**ఏడు రకాలు.. 350 మట్టిపాత్రలు**

20 పెద్ద బాణాల్లో గంగాజలం పోసి నిల్వ ఉంచుతారు. 55 నీటి కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలు, 25 పెంకలను ఆదివాసీలు ఆలయ పరిసర ప్రాంతాల్లో పిండివంటలు, నైవేద్యాలు తయారు చేయడానికి వాడుతారు. వీటి తయారీకి గుగ్గిల స్వామి, అతని భార్య నెలరోజుల పాటు కష్టపడుతారు. స్వామి తండ్రి రాజన్న 75 ఏళ్లపాటు కుండలు తయారు చేసి అందించారు. రాజన్న తండ్రి రాజన్న సైతం 70 ఏళ్ల కుండలను తయారు చేసి ఇచ్చారు. ప్రస్తుతం స్వామి దాదాపు 40 ఏళ్లుగా కుండలను తయారు చేసి ఇస్తున్నారు.

### తరాల నుంచి..



తరతరాలుగా తాతముత్తాల నుంచి కుండలు తయారీ చేసి నాగోబాకు ఇస్తున్నాం. నాగోబా జాతర ప్రారంభం నుంచి మా వంశమే కుండలను తయారు చేస్తుంది.

– గుగ్గిల స్వామి, సిరికొండ

### ఆచారం కోసం నేర్చుకుంటున్నా..



కుండ తయారీ ఉపాధిని ఇవ్వడం లేదు. దశాబ్దాల నుంచి తమ వంశమే నాగోబా జాతరకు కుండలు తయారు చేసి ఇస్తున్నాం. ఆచారం కోసం తండ్రి వద్ద కుండల తయారీ నేర్చుకుంటున్నాను.

– గుగ్గిల గంగాధర్, గుగ్గిల స్వామి కుమారుడు

### తయారీకి నెల సమయం



ఏడు రకాలుగా 350 మట్టిపాత్రల తయారీకి నెల సమయం పడుతుంది. అడవి నుంచి మట్టిని తీసుకురానివ్వడంలేదు. దూరప్రాంతాల నుంచి మట్టిని డబ్బులతో కొనుగోళ్లు చేస్తున్నాం. వీటిని విక్రయిస్తే రూ.50 వేలు వస్తాయి. కాని కేవలం రూ.10 వేలు ఇస్తున్నారు. దైవకార్యమని కుండలను తయారీ చేసి ఇస్తున్నాం.

– గుగ్గిల కళావతి, గుగ్గిలస్వామి భార్య

# ఒకరిపై అట్రాసిటీ కేసు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మిల్కూరు మల్లేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి రాజయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిలో సాగు చేసుకుంటున్నాడు. అయితే పల్లికొండ రమేశ్ నుంచి ఆ భూమిని కొనుగోలు చేశానని మల్లేశ్ శనివారం ట్రాక్టర్ వీల్స్‌తో పంటను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన రాజయ్యను కులం పేరుతో దూషించి నెట్టివేశాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదుతో ఆదివారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# దివ్యాంగులకు అండగా పథకాలు



దివ్యాంగులకు చెక్కులను అందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: దివ్యాంగులకు అండగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 25 మంది దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం కింద వంద శాతం సబ్సిడీతో రూ.50 వేల చెక్కులు మంజూరయ్యాయి. వాటిని గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు ప్రదానం చేశారు. బ్యాంకు లింకేజి ద్వారా రూ.2 లక్షలు, రూ.3 లక్షల చెక్కులను ఇద్దరికి అందించారు. ఉచిత ఉపకరణాల పంపిణీలో భాగంగా మోటార్ వెహికిల్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్‌ఖాన్, సీడీపీవో విజయలక్ష్మి, స్వరూపరాణి, ఎఫ్ఆర్‌వో ఫర్హానా, కోఆర్డినేటర్ సౌజన్య పాల్గొన్నారు.